సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 3 । మార్చి । 2025



'మిత్ర' ద్రోహం

కూటమి సర్కారు మిత్రద్రోహం చేస్తోంది. వైద్య మిత్రలకు ఆరోగ్య భద్రత కరువైంది.


- 8లో



జీఈడీకి పూర్వ వైభవం

జీఈడీ కాలవ్యవధిలో మార్పులు రానున్నాయి. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- 8లో



న్యూస్‌రీల్

డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలకు షెడ్యూల్ విడుదల



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ మేరకు వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ నెల 13వ తేదీలోపు విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 18వ తేదీ నుంచి 25 మధ్య పరీక్షలు నిర్వహించనున్నారు.

డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు అధికారులు షెడ్యూల్ విడుదల చేసి, వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. పరీక్ష ఫీజును సోమవారం నుంచి 14వ తేదీ మధ్య చెల్లించాల్సి ఉంటుంది. పరీక్షలు ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించనున్నారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామికి ఆదివారం ఉదయం నుంచి విశేష పూజలను నిర్వహించారు. మాఘమాసం మూడో ఆదివారం సందర్భంగా స్వామి వారి మూలవిరాట్టును ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎండ తీవ్రత కారణంగా మజ్జిగ పంచారు. ఒక్క రోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.3,77,100, విరాళాలు, ప్రత్యేక పూజల ద్వారా రూ.68,837, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 1.74 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఈఓ తెలిపారు.

జామియా మసీదులో ఇఫ్తార్ విందు



జామియా మసీదులో ఇఫ్తార్ విందు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జీటీ రోడ్డులో ఉన్న జామియా మసీదులో ఆదివారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. రంజాన్ మాసం మొదటి రోజున అందరూ కలసి ముందుగా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జామియా మసీదులో మొదటిసారి తమ ఉపవాస దీక్షలు ప్రారంభించారు. కార్యక్రమంలో మసీదు అధ్యక్షుడు మహీబుల్లా ఖాన్, హాజీ భయ్యా, అమీరుల్లా బేగ్, ఉస్మాన్, షకూర్‌ఖాన్, కమిటీ సభ్యులు, ఫజర్ జమాత్ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యో.. రైతన్న

కాశీబుగ్గ: పశువుల మేత కోసం మినప తొక్కను పట్టుకుని రోడ్డు దాటుతుండగా యాక్సిడెంట్ జరిగి ఓ రైతన్న రెండు కాళ్లను కోల్పోయాడు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 10వ వార్డు పారసాంబ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం ఈ ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన రైతు కొల్లకోట రాము ఉదయం పశువుల మేతకు మినప తొక్కు పట్టుకుని రోడ్డు దాటుతుండగా టెక్కలి నుంచి కంచిలికి బైక్‌పై వెళ్తున్న మీనకేతన్ డొలై అనే వ్యక్తి రామును ఢీకొన్నాడు. ప్రమాదంలో రైతు రాముకు రెండు కాళ్లు విరిగిపోయాయి. వాహనదారులు చూసి వెంటనే రైతుకు సపర్యలు చేశారు. పలాస 108 అంబులెన్సు సిబ్బంది సత్యం, నాగేష్, ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.



ప్రమాద స్థలం వద్ద కొల్లకోట రాము

నా పేరు ఫిజియో... నాకు కావాలి థెరపీ



- రిమ్స్ ఆస్పత్రిలోని అత్యంత కీలక విభాగంపై అధికారుల నిర్లక్ష్యం
- కేటాయించని బడ్జెట్.. మూలకు చేరిన పరికరాలు
- రిమ్స్‌లో ఫిజియోథెరపీకి రోగుల క్యూ

మీరు రిమ్స్ ఆస్పత్రికి వచ్చారా.. ఓపీ కౌంటర్‌ల సమీపంలో నేను ఉంటా.

నా పేరు ఫిజియోథెరపీ విభాగం. రోజూ ఎంతో మందికి సేవలందిస్తుంటా. నిద్రలో మెడ పట్టేసినా.. పని చేస్తూ నడుం పట్టేసినా.. శస్త్రచికిత్స పూర్తయిన తరువాత ముందుకు కదలాలన్నా నా సేవలే అవసరం. కానీ మీకు సేవలందించే సిబ్బంది కొరత నన్ను వేధిస్తోంది. అలాగే పరికరాలు సరైనవి లేక ఉన్నవి మూలకు చేరి.. బడ్జెట్‌లో కేటాయింపులు జరగక అవసరార్థులకు ఉన్న పరికరాలతోనే నా సిబ్బంది అరకొర సేవలందిస్తున్నారు. ఎన్నిసార్లు నా సిబ్బంది బడ్జెట్ కేటాయింపు కోసం వినతులు సమర్పించినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఓ రోగి విషయంలో ఇటీవల జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినా, నా విభాగం ఇంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా కూడా నా సేవలు ఎలాంటి సత్ఫలితాల్నిస్తున్నాయో.. ఆస్పత్రి వ్యవస్థలో నేనెంత కీలకమో మీరే చదవండి.

–సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం



ఇవి సమకూర్చరూ..!

నా విభాగంలో ఒక టెన్స్ మిషన్ తప్ప సరైన పరికరం ఒక్కటీ లేదు. ఇది కూడా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఇటీవల సొంత వ్యయంతో సమకూర్చి ఉదారత చాటుకున్నారు. రోగులకు మెరుగైన చికిత్స అందించేందుకు నాకు ఇంటర్ ఫెరన్సియల్ థెరపీ ఎక్విప్‌మెంట్, మజిల్ స్టిమ్యులేటర్, టెన్స్, అల్ట్రా సౌండ్(ఫిజియోథెరపీ), హ్యాండ్ పుల్లీ(డబుల్ వీల్స్), షోల్డర్ వీల్ క్వాడ్రీసెప్స్ టేబుల్, కంటిన్యువస్ పాసివ్ మోషన్ మెషీన్(సీపీఎం), ఐఆర్‌ఆర్ ల్యాంప్, స్టాటిక్ బైసైకిల్, థెరాబాండ్ సెట్, వ్యాక్స్ బాత్, యాంకిల్ ఎక్సర్‌సైజర్, షార్ట్ వేవ్ డయాథెర్మీ, ట్రాక్షన్ మెషీన్ బోత్ సర్వికల్ అండ్ లుంబర్, ప్యారలల్ బార్‌లు చాలా అవసరం. కనీసం ఒక్కొక్కటైనా సమకూర్చినా సరిపోతుందని నా అభ్యర్థన.



ఫిజియోథెరపీ విభాగంలో పరికరం

కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినా..

కొద్ది రోజుల క్రితం మూతి వంకరపోవడంతో ఓ ఆటోడ్రైవర్‌ను వైద్యులు నా విభాగానికి రిఫర్ చేశారు. సరైన పరికరాలు లేకపోవడంతో నా సిబ్బంది ఫేషియల్ ఎక్సర్‌సైజ్‌లు నేర్పించి పంపించేశారు. రోగి సంతృప్తి చెందక మెరుగైన వైద్యం కావాలంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఘటనలో కలెక్టర్ కూడా సీరియస్ అయ్యారని సమాచారం. విభాగంలో ఆధునిక పరికరాల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఆస్పత్రి సిబ్బందిని ఆదేశించినట్లు సమాచారం.





వ్యాయామ పరికరం

ఈ అబ్బాయి పేరు మురళీ కృష్ణ..

14 ఏళ్ల ఈ బాలుడి స్వస్థలం చిలకపాలెం. కుప్పిలి మోడల్ స్కూల్‌లో చదువుకునేవాడు. గత ఏడాది మే 4న పొందూరు వైపు వెళుతున్న భారీ వాహనం ఈడ్చుకెళ్లడంతో మొత్తం రెండు కాళ్లకు సంబంధించిన మజిల్ పూర్తిగా పోయింది. ఎముకలు మాత్రం మిగిలాయి. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.13 లక్షలు ఖర్చు పెట్టి చికిత్స చేయించినా ఫలితం శూన్యం. విధిలేని పరిస్థితుల్లో విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళితే కాళ్లు తీసేయాలన్నారు. తల్లిదండ్రులు చేసేది లేక కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు బాలుడి తండ్రి తొడ నుంచి మజిల్ సేకరించి కాళ్లకు అమర్చారు. నెల రోజుల తరువాత బాలుడి మజిల్‌తో మరో శస్త్ర చికిత్స చేశారు. మా ప్రయత్నం మేం చేశాం.. ఇంకా మీరు రోజూ ఫిజియోథెరపీ చేయించుకుంటే ఫలితం ఉంటుందని అక్కడ డాక్టర్లు చెప్పేశారు. నడవలేని స్థితిలో మురళీ కృష్ణ నా విభాగానికి వచ్చాడు. నా సిబ్బంది ఉన్న పరికరాలతోనే రోజువారీ వ్యాయామాలను చేయిస్తూ తొమ్మిది నెలలుగా ఫిజియో చేయించుకుంటున్నాడు. చక్కగా నడుస్తూ సాధారణ జీవితంలోకి మెల్లమెల్లగా వస్తున్నాడు. నా విభాగంపై దృష్టి సారించే బడ్జెట్ కేటాయిస్తే అధునాతన పరికరాలు ఏర్పాటు చేస్తే రోగులు మరింత త్వరగా కోలుకునే అవకాశం ఉంది.

రోగులు, సహాయకులకు ట్రాన్స్‌పోర్టు పట్టించుకోరా..

రోజూ నా విభాగానికి 40 నుంచి 60 మంది వరకు రోగులు చికిత్స కోసం వస్తున్నారు. వీరికి సహాయకులు వస్తున్నారు. రోజువారీ చికిత్స కాబట్టి వీరి రాకపోకలకు వ్యయ ప్రయాసలు తప్పడం లేదు. అందుకే ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు రోగులు, సహాయకుల రాకపోకలకు వీలుగా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసి సహకరిస్తే బాగుంటుందనేది నా సూచన. యాక్సిడెంట్ కేసులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. నడుము నొప్పి, కీళ్ల నొప్పులు, కండరాలు, భుజాల నొప్పులతో బాధ పడేవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. వీరందరి కోసమే తగిన బడ్జెట్ కేటాయించి సిబ్బందిని పెంచి.. పరికరాలను అందుబాటులోకి తెస్తారు కదూ.

డీఎస్‌ఓ కార్యాలయంలో వసూళ్ల పర్వం



శ్రీకాకుళం పాత బస్టాండ్: జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఇటీవల అవినీతి పెచ్చుమీరింది. ధాన్యం సేకరణ అదనపు లక్ష్యాల సమయంలో మిల్లర్ల నుంచి టార్గెట్లు, ఆర్బీకే నుంచి మిల్లులకు ట్యాగింగ్ పేరిట పెద్ద ఎత్తున వసూళ్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి కావడంతో.. అదనపు కొనుగోళ్ల కోసం ప్రభుత్వానికి అనుమతులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వం ఒక్కో మండలానికి 600 మెట్రిక్ టన్నుల వంతున జిల్లాకు 18,000 మెట్రిక్ టన్నులు అదనపు కొనుగోళ్లకు అనుమతి వచ్చింది. అయితే ఈ సమయంలో డీఎస్‌ఓ కార్యాలయం నుంచి ట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. రైతు భరోసా కేంద్రం నుంచి మిల్లర్లకు ట్యాగింగ్ చేయాలి. అందుకు గాను ఆ కార్యాలయంలో నరసన్నపేటకు చెందిన ఒక క్లర్క్ భారీగా మిల్లర్స్ నుంచి వసూలు చేస్తున్నట్టు సమాచారం. నేరుగా ఆయన మిల్లర్స్ నుంచి డబ్బులు వసూలు చేయకుండా ఆ ఉద్యోగి అన్నయ్య ఫోన్ పేకు అమౌంట్ వేసి, ఆ స్క్రీన్‌షాట్ పెట్టిన వారికి మాత్రమే ట్యాగింగ్ చేస్తున్నట్లు మిల్లర్లు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కార్యాలయ ఖర్చు కోసం ఉన్నతాధికారులకు అందజేయాల్సి ఉంటుందని, ప్రతి మిల్లు నుంచి రూ. 40,000 నుంచి రూ.60 వేల వరకు వసూలు చేస్తున్నట్లు కూడా ఆరోపిస్తున్నారు. ఈ నగదును ప్రభుత్వంలో ఉన్న నాయకులకు, అధికారులకు ఇవ్వాల్సి ఉంటుందని వారు చెబుతుండడం విశేషం.

కూటమి ప్రభుత్వానికి అనుకూల వర్గాల మిల్లులకు ఒక రేటు, అనుకూలంగా లేని మిల్లులకు ఒక రేటు తీసుకుని ఇబ్బందులు పెడుతున్నారు. టార్గెట్లు నిర్ణయాల్లో కూడా వివక్ష పాటిస్తున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో ఈ ఏడాది 260 రైస్ మిల్లుల నుంచి ధాన్యాన్ని సేకరిస్తున్నారు. సగటున ఒకరిద్దరు మిల్లర్ల నాయకుల మినహా అందరి నుంచి అధిక మొత్తంలో వసూలు చేసినట్టు మిల్లర్ల అసోసియేషన్ బాహాటంగానే విమర్శిస్తోంది. ఈ వసూళ్లు ప్రధానంగా మిల్లర్లకు ఇచ్చే ధాన్యం ఏసీకే ఆధారంగా జరుగుతున్నాయని చెబుతున్నారు. డీఎస్‌ఓ కార్యాలయంలో నరసన్నపేటకు చెందిన ఆ కార్యాలయం కేంద్ర బిందువుగా ఈ వసూళ్లన్నీ చేస్తున్నారని, ఆయనకు కూటమి ప్రభుత్వంలో ప్రధాన నాయకులతో బంధుత్వం ఉన్నందు వల్ల ఆగడాలు చెల్లుబాటు అవుతున్నాయని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యాలయంలో ఈ ఉద్యోగి అవినీతిపై ఇప్పటికే జాయింట్ కలెక్టర్ దృష్టికి కొంతమంది మిల్లర్లు తీసుకువెళ్లినట్టు తెలిసింది. అయితే ఆయన ఇంతవరకు చర్యలు తీసుకోలేదని మిల్లర్లు చెబుతున్నారు.

వాహనదారులకు జరిమానాల మోత



శ్రీకాకుళం క్రైమ్ : సవరించిన మోటారు వాహన చట్టం ప్రకారం కొత్త అపరాధ రుసుం యాప్ జిల్లాలో అప్‌డేట్ అయ్యింది. శ్రీకాకుళం నగర పరిధిలో ఆదివారం ఒక్కరోజే 100 ఫైన్లు విధించిన ట్రాఫిక్ పోలీసులు రూ. 50 వేలు వరకు అపరాధ రుసుం చలానాల రూపంలో వసూలు చేశారు.

హెల్మెట్ ధరించని వారే టార్గెట్

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌లు ధరించకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు. అందులో భాగంగానే ఆదివారం 18మంది హెల్మెట్లు ధరించనివారిపై ఫైన్లు వేశామని ట్రాఫిక్ సీఐ వి.నాగరాజు పేర్కొన్నారు. ఇన్నాళ్లు హెల్మెట్ ధరించకపోతే రూ.100 లు యాప్‌లో అప్‌లోడ్ అయ్యేదని ఇప్పుడు రూ. 1000 అవ్వడంతో రూ. 18 వేలు వీరి నుంచి చలానాల రూపంలో అప్‌డేట్ అయ్యిందన్నారు. నగర పరిధిలో తిరిగే వాహనదారులు హెల్మెట్లు పెట్టనక్కరలేదని, సర్వోన్నత న్యాయస్థానం చెప్పిందని ఏవేవో చెప్పి వాదిస్తున్నారని, అలాంటిదేమీ లేదని తప్పనిసరిగా హెల్మెట్లు పెట్టాల్సిందేనని సీఐ స్పష్టం చేశారు. ఈ మేరకు ఏడురోడ్ల కూడలిలో ఆదివారం రాత్రి వాహనదారులకు అవగాహన కల్పించామన్నారు.

కొత్త జరిమానాలు ఇవే..

మోటారు వాహనాల సవరణ చట్టం-2019 ప్రకారం ఈ నెల నుంచి నియమ నిబంధనలు అతిక్రమించిన వాహనదారులకు కొత్త జరిమానాలు పడనున్నాయి. ఈ మేరకు ఉత్తర్వులు కూడా విడుదలయ్యాయి.

ఉల్లంఘన	పాత జరిమానా	కొత్త జరిమానా
లైసెన్సు లేని వ్యక్తికి వాహనం ఇస్తే	రూ.1000	రూ. 5,000
లైసెన్సు లేకుండా వాహనం నడిపితే	రూ. 500	రూ. 5,000
మైనరు వాహనం నడిపితే	రూ. 500	రూ.10,000
అతివేగం(చిన్నవి)	రూ. 400	రూ. 1000
(పెద్దవి)	రూ. 500	రూ. 2,000
సీటుబెల్టు ధరించకపోతే	రూ. 100	రూ. 1000
హెల్మెట్ ధరించకపోతే	రూ. 100	రూ. 1000

చెలమ నీరే గతి



వంశధార నదీతీర గ్రామాల్లో తాగునీటికి తంటాలు తప్పడం లేదు. వేసవి ప్రారంభానికి ముందే ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తీర గ్రామాలైన దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి గ్రామాల్లో మంచినీరు దొరకడం లేదు. తాగునీరు సరఫరా చేసేందుకు మెగా వాటర్ పథకం నుంచి పైపులైన్లు వేసినప్పటికీ సక్రమంగా నీరు సరఫరా కాకపోవటంతో వంశధార నదిలోని చెలమ గొయ్యిలపై ఆధారపడుతున్నారు.

– ఎల్ఎన్ పేట

చీకటి వేళ.. మీనాల మేళా



ఆ ఊరివారంతా ఐకమత్యంగా ఉంటారు. ఊరికి సంబంధించి ఏం తెచ్చినా సమంగా పంచుకుంటారు. ఏటా ఇలాగే చేపలు కూడా పంచుకుంటారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ పాటిస్తున్నారు పలాస మండలం మోదుగులపుట్టి గ్రామవాసులు. గ్రామంలోని చెరువులో ఆదివారం సాయంత్రం చేపలు పట్టారు. గ్రామంలో ఉండే 125 ఇళ్లను లెక్కించి అన్ని సమాన వాటాలు వేసి ఇంటింటికీ పంచిపెట్టారు. ఆదివారం ఊరుఊరంతా చేపల కూరే మరి.

– కాశీబుగ్గ

వత్సవలసకు పోటెత్తిన భక్తులు

గార: మండలంలోని చిన్న వత్సవలసలో కొలువున్న రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి మాఘ మాసం నాల్గో వారం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. శనివారం రాత్రికి గ్రామానికి వచ్చిన భక్తులు సమీప తోటల్లోనూ, ఆరు బయట బస చేశారు. ఉదయం సమీప సముద్రంలో పవిత్ర స్నానాలు ఆచరించి ముందుగా భూలోకమ్మను, అనంతరం రాజరాజేశ్వరి (రాజమ్మతల్లి)ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ వారం నాటుకోళ్లు, గొర్రెలు సమర్పించడంతో పాటు చిన్నారుల పుట్టుకొప్పులు భక్తులు మొక్కులు ద్వారా చెల్లించారు. ముఖ్యంగా తొలి సంతానాన్ని ఇక్కడికి తీసుకువచ్చి తొలికొప్పు (పుట్టుకొప్పు)ను తీయించి ప్రత్యేకంగా ముడుపులు చెల్లించుకున్నారు. ఈ వారం జాతరకు శ్రీకాకుళం పట్టణ సీఐ పైడపునాయుడు, ఎస్ఐ ఆర్.జనార్ధనరావు ఆధ్వర్యంలో 90 మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నారు. శనివారం రాత్రి వేళ కూడా అదనపు భద్రతా చర్యలు చేపట్టగా 15 మద్యం సీసాలతో పట్టుబడినట్టు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.



చినవత్సవలస గ్రామంలోని భూలోకమ్మ గుడి వద్ద భక్తులు



సముద్ర తీరం వద్ద గస్తీలో మెరైన్ సీఐ బర్ల ప్రసాదరావు

పీసీఎంఏ అధ్యక్షుడిగా మల్లా శ్రీనివాస్

కాశీబుగ్గ: పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మల్లా శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. ఈ నెల 4న 188 మంది సభ్యులతో ఎన్నికలు జరగాల్సి ఉండగా నామినేషన్‌లు వేసిన 8 మందిలో ఐదుగురు ఉపసంహరించుకోవడంతో ఆదివారం ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నారు. అధ్యక్షుడిగా మల్లా శ్రీనివాస్, కార్యదర్శిగా టంకాల రవిశంకర్, కోశాధికారిగా మల్లా సంతోష్‌లను ఎన్నుకున్నారు.



శ్రీనివాస్, కార్యదర్శి రవి, కోశాధికారి సంతోష్

క్లుప్తంగా

రమ్య తిరుమలను సందర్శించిన చిన్నజీయర్ స్వామి


అనుగ్రహ భాషణ చేస్తున్న చిన్న జీయర్ స్వామి

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి రోడ్డులోని రమ్య తిరుమల ఆలయాన్ని త్రిదండి రామానుజ చిన్నజీయర్ స్వామి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహ భాషణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కరి రంగనాథ వేణు మాధవాచార్యులు, గిరిజారాణి, దుర్గాప్రసాద్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో రాయిపూర్‌లో తెలుగు మహాసభలు


సన్నాహక సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పలాస: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయిపూర్‌లో ఈ నెల 8, 9వ తేదీల్లో ద్వితీయ తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నట్టు కమిటీ కన్వీనర్ లండ రుద్రమూర్తి చెప్పారు. ఈ మేరకు ఆదివారం అక్కడి ఆంధ్రా అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. సభలకు ఆంధ్రప్రదేశ్ నుంచి పలువురు ప్రముఖులు హాజరవుతున్నారని, తెలుగుదనం ఉట్టిపడేలా కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. తెలుగు మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్రేన్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణారావు

కంచిలి: జాతీయ రహదారి నుంచి కంచిలిలోకి ప్రవేశించే సర్వీస్ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి కుడిచేయిని కోల్పోయాడు. బూరగాం గ్రామానికి చెందిన కార్పెంటర్ గుజ్జు కృష్ణారావు, స్నేహితుడు కాయ చలపతిరావు, అతని తల్లి కలిసి ఎస్.ఎం.పురం గ్రామానికి బంధువుల పరామర్శకు ఆదివారం వెళ్లారు. వారిద్దరూ అక్కడే ఉండిపోవడంతో కృష్ణారావు నడుచుకుంటూ కంచిలి వైపు వస్తుండగా, వెనుక నుంచి వచ్చిన క్రేన్ ఢీకొట్టింది. కృష్ణారావు కుడిచెయ్యి పైనుంచి టైరు వెళ్లడంతో నుజ్జునుజ్జయ్యింది. వెంటనే క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో సోంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. చెయ్యి పూర్తిగా విరిగిపోవడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నానికి తరలించారు. కాగా, కృష్ణారావును ఢీకొట్టిన వాహనం ఆగకుండా వెళ్లిపోవడంతో హైవేలోని సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. క్రేన్ డ్రైవర్ సింగంశెట్టి శంకరరావు పలాస మండలం బంటుకొత్తూరు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.పారినాయుడు తెలిపారు.

ఏపీబీఏ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అశోక్



శ్రీకాకుళం న్యూకాలనీ: బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మెట్ట అశోక్‌కుమార్ ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన సంఘ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో శ్రీకాకుళం జిల్లాకు పెద్దపీట వేశారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా నాలుగేళ్ల నుంచి అశోక్‌కుమార్ విశేష సేవలు అందిస్తున్నారు. ఈయన హయాంలో శ్రీకాకుళం వేదికగా అండర్–19, అండర్–17 విభాగాల్లో రెండు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీలను విజయవంతంగా నిర్వహించి ప్రసంశలు అందుకున్నారు. అశోక్ ఎన్నిక పట్ల జిల్లా బ్యాడ్మింటన్ సంఘ చైర్మన్ ఆర్.రాజేంద్రన్, చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, అధ్యక్షుడు కె.సాగర్, సీఈఓ సంపతిరావు సూరిబాబు, శైలానీ, ప్రసాద్, రత్నాజీ హర్షం వ్యక్తంచేశారు.

యువతి ఆత్మహత్య కేసులో యువకుడు అరెస్టు

సోంపేట: మండలంలోని బారువ కొత్తూరు గ్రామానికి చెందిన వలిశెట్టి తులసి ఇటీవల ఆత్మహత్య చేసుకుంది. దీనికి కారణం తులసితో కలిసి బట్టిగల్లూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఎం.ప్రదీప్ అని మృతురాలి తండ్రి హరికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు దర్యాప్తులో భాగంగా ఆదివారం రాత్రి ఎం.ప్రదీప్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు.

కూటమి సర్కారు.. మిత్రద్రోహం!

- వైద్య మిత్రల ఉద్యోగ భద్రతపై నీలినీడలు
- ఆరోగ్యశ్రీని బీమా కంపెనీలకు అప్పగించే కుట్ర
- సర్వీసు పోతుందని సిబ్బంది ఆందోళన
- కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్



జిల్లాలో వైద్యసేవలిలా..

ఆస్పత్రులు	26
పీహెచ్‌సీలు	76
సీహెచ్‌సీలు	13
ఏరియా ఆస్పత్రులు	2
జిల్లా వైద్యశాలలు	2
ప్రైవేటు, ఇతర వైద్యశాలలు	50
వైద్య మిత్రలు	120
టీమ్‌లీడర్లు	03
ఆఫీస్ అసోసియేట్లు	03

వజ్రపుకొత్తూరు : కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్) పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. వైద్య మిత్ర శ్రేయస్సు కోరి గత జగనన్న ప్రభుత్వం ఆప్కాస్ ఏర్పాటు చేస్తే దానిని రద్దు చేసే దిశగా ప్రస్తుత రాష్ట్ర సర్కారు అడుగులు వేస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి కొత్త విధానంలో ఎన్టీఆర్ వైద్య సేవ నిర్వహణ కొనసాగుతుందన్న వార్తలు వస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న 2600 మందికి పైగా వైద్య మిత్రలు, దాని పరిధిలో పని చేసే ఇతర ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగులు తమ మిత్రులని, అన్ని విధాలా అండగా ఉంటామని హామీలు ఇచ్చిన కూటమి నేతలు.. గద్దెనెక్కిన తరువాత తీసుకుంటున్న నిర్ణయాలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఆప్కాస్ రద్దుకు కుట్ర:

2008లో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రారంభమైన ఆరోగ్యశ్రీ పథకంలో అప్పట్లో స్థానికతను బట్టి ఉద్యోగులను ఎంపిక చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ విభాగంలో పని చేసిన ఉద్యోగులను ఆప్కాస్(ఏపీ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్ సర్వీసెస్) కిందకు చేర్చారు. వారికి సీఎఫ్‌ఎంఎస్ ఐడీ ద్వారా ప్రతి నెలా 2న గానీ 5న గానీ జీతాలు ఇచ్చారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా కల్పించారు. సీఎఫ్‌ఎంఎస్‌లో వేతనం తీసుకోవడం వల్ల తమ ఉద్యోగాలకు భద్రత ఉంటుందన్న ఆశతో ఇన్నాళ్లు ఉద్యోగాలు చేసుకుంటూ వచ్చారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవను ప్రైవేటు బీమా కంపెనీలకు అప్పగించే కుట్ర జరుగుతుండటంతో ఉద్యోగ భద్రతపై వైద్య మిత్రలు ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 26 వైద్యశాలల్లో 120 మంది వైద్య మిత్రలు పని చేస్తున్నారు. వీరిలో 90 శాతం మంది 17 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. ఎక్కువ మంది డిగ్రీతో పాటు పీజీలు చేసిన వారూ ఉన్నారు. వైద్యమిత్రలతో పాటు జిల్లాలో ముగ్గురు టీమ్ లీడర్లు, డీసీ ఒకరు, ఆఫీసు అసోసియేట్లు ఇద్దరు, కెమెరా మానిటరింగ్ సిబ్బంది ఇద్దరు పని చేస్తున్నారు. డీఎం పోస్టు మాత్రం ఖాళీగా ఉంది. తమను బీమా కంపెనీల పరిధిలోకి తీసుకొస్తే తమ భవిషత్ ప్రశ్నార్థకంగా మారుతుందని, సర్వీసు నష్టపోతామని వైద్యమిత్రలు వాపోతున్నారు.

17 ఏళ్లుగా సేవలు..

రోగులు వైద్యశాలల్లో చేరినప్పటి నుంచి తిరిగి క్షేమంగా ఇంటికి చేరుకునే వరకు వైద్య మిత్రలు పర్యవేక్షిస్తుంటారు. పేద రోగులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ సేవలు అందిస్తుంటారు. వీరితో పాటు ఉద్యోగులు, జర్నలిస్టుల హెల్త్ కార్డులు, ఆరోగ్య రక్ష స్కీమ్‌కు సంబంధించి వివరాలు తెలియజేస్తుంటారు. ఇలా అన్ని విభాగాల్లో 17 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వయసు కూడా చాలా మందికి 50 ఏళ్ల దాటింది. ఆరోగ్యశ్రీ ప్రైవేటు చేతుల్లోకి వెళితే ఎవరిని ఉంచుతారో..? ఎవరిని తొలగిస్తారో..? ఆందోళనగా ఉందని, ఈ వయసులో వేరే ఉద్యోగాలు వచ్చే అవకాశం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.


ఆస్పత్రిలో ఎన్టీఆర్ వైద్యసేవ హెల్ప్‌డెస్క్

టైం స్కేల్ పద్ధతిలో కొనసాగించాలి



డిగ్రీలు, పీజీలు చేసుకుని 17 ఏళ్లగా ఆరోగ్యమిత్రలుగా సేవ చేస్తున్నాం. ఆప్కాస్ రద్దు చేస్తే తమను ట్రస్ట్ పరిధిలో పని చేసే కాంట్రాక్ట్ ఉద్యోగులకు గుర్తించి మినిమమ్ టైం స్కేల్ పద్దతిలో కొనసాగించాలి. ఉద్యోగ భద్రత కల్పించి సమయానిక జీతాలు చెల్లించాలి. సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించాలి. చేసిన సర్వీసును సీనియారిటీగా గుర్తించాలి. ప్రభుత్వం తమ పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలి. లేకుంటే రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు దశల వారీగా ఉద్యమం చేస్తాం.

– ఎం.త్రినాథరావు, జిల్లా అధ్యక్షుడు, ఏపీ వైద్యమిత్ర కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్

అలరించిన త్యాగరాజస్వామి కీర్తనలు



జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో ఆనందోబ్రహ్మ, స్పిరిట్యువల్ టాబ్లెట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాజ స్వామి ధ్యాన ఆరాధన ఉత్సవం ఘనంగా నిర్వహించారు. శృతి లయ సంగీత శిక్షణాలయం, ఆనందో బ్రహ్మ బృందాల త్యాగరాజ కీర్తనలు, సుందరంపల్లి శ్రీనివాస్ శాక్సోఫోన్ కచేరి, సుసరాపు లక్ష్మీగణపతి శర్మ బృందం త్యాగరాజ కృతుల గానం, దుంపల ఈశ్వరరావు బృందం త్యాగరాజ కీర్తనలు, పంచరత్న కీర్తనల గోష్టి అలరించాయి. కార్యక్రమంలో స్వాతి సోమనాథ్, శ్రీను, డాక్టర్ మాలతి, స్పిరిట్యువల్ పిరమిడ్ మెడిటేషన్ సీఈవో శ్రీదేవి, మావుడూరు శ్రీనివాస శర్మ, త్రివిక్రమదేవ్ తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

నేషనల్ కోచింగ్ శిబిరానికి ఇద్దరు ఎంపిక


ఎంపికైన ప్రవీణ్, ప్రేమశ్రీలతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అర్జున్‌రావురెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి పోటీలకు ముందు జరిగే శిక్షణా శిబిరాలకు జిల్లా నుంచి ఇద్దరు బాస్కెట్‌బాల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రాబబుల్స్ జట్లకు ఎంపికైనవారిలో వి.ప్రవీణ్, ఎస్.ప్రేమశ్రీ ఉన్నారు. ఈ పోటీలు మార్చి 3 నుంచి చిత్తూరు వేదికగా మొదలుకానున్నాయి. అనంతరం ఈ నెల 18 నుంచి 24 వరకు అసోం రాష్ట్రం గౌహతి వేదికగా జరగనున్న ఆలిండియా అండర్–23 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రా జట్టు ప్రాతినిధ్యం వహించనున్నాయి. వీటికి వీరిద్దరి ఎంపిక లాంఛనమేనని జిల్లా సంఘ ప్రతినిధులు భావిస్తున్నారు. ఆదివారం పయనమైన క్రీడాకారులను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి తన నివాసంలో అభినందించారు. శిక్షణా శిబిరాలకు, జాతీయ పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్, కార్యదర్శి గాలి అర్జున్‌రావురెడ్డి, సీనియర్ ప్లేయర్స్ పాల్గొన్నారు.

ఉత్కంఠగా కబడ్డీ పోటీలు


హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

పలాస:

మండలంలోని బొడ్డపాడులో రెండో రోజు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. నరసన్నపేట జట్టుపై జిల్లుండ, ఎల్.కొత్తూరుపై గొల్లవూరు, మామిడిపల్లి జట్టుపై జెస్సీ టీం విజయం సాధించాయి. రాష్ట్ర స్థాయి పోటీలకు మొత్తం 30 జట్లు రాగా ఇంకా విశాఖపట్నం, అనకాపల్లి తదితర జట్లు తమ ప్రతిభను చాటుకోనున్నాయి. ఫ్లడ్ లైట్ల మధ్య పోరు సాగుతుండటంతో స్థానికులు, క్రీడాభిమానులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. బొడ్డపాడు యువజన సంఘం 71వ వార్షికోత్సం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు యార్లగెడ్డ వెంకన్న చౌదరి, జిల్లా కార్యదర్శి చిరంజీవులు, ఉపాధ్యక్షులు రాపాక అప్పలస్వామి, బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్షుడు తామాడ క్రాంతి, జైభీమ్ యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి


బాలకృష్ణ మృతదేహం

పాతపట్నం: రైలు ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పాతపట్నం మండలం రంకిణి పంచాయతీ బగంతర గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జీబ బాలకృష్ణ(32)ను ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో పాతపట్నం మహేంద్రతనయా నది బ్రిడ్జి సమీపంలో పూరి నుంచి గుణుపూర్ వెళుతున్న రైలు ఢీకొట్టింది. వెంటనే రైలు నిలిపివేసి క్షతగాత్రుడి వద్దకు రైల్వే సిబ్బంది వెళ్లగా ప్రాణం ఉందని తెలుసుకుని, వెంటనే అదే రైలులో పర్లాకిమిడి (ఒడిశా) తీసుకెళ్లారు. స్టేషన్‌కు చేరుకోగానే బాలకృష్ణ మృతి చెందాడు. ఈ విషయాన్ని రైల్వే సిబ్బంది పలాస రైల్వే ఆర్‌పీఎఫ్‌కు సమాచారం అందించామని రైల్వే అధికారులు తెలిపారు. బాలకృష్ణ ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతనికి భార్య జీబ భవాని, రెండేళ్ల బాబు వర్ధన్ ఉన్నారు. రైలు వస్తున్న సమయంలో ట్రాక్‌పైకి బాలకృష్ణ ఎందుకు వెళ్లాడో తెలియాల్సి ఉంది.

పాతపద్ధతిలోనే 'సాగు'తూ..


ఏతంతో నీరు తోడుతున్న రైతు మల్లేశ్వరరావు

వజ్రపుకొత్తూరు రూరల్: సాంకేతిక రంగాన్ని అందిపుచ్చుకొని అన్నింటా యంత్రాలు, మోటార్లను వినియోగిస్తున్న ఈ రోజుల్లో కొంత మంది రైతులు వ్యవసాయంలో ఇప్పటికీ పాత పద్ధతులనే అవలంబిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలం సీతాపురం గ్రామానికి చెందిన రైతు తమ్మినాన మల్లేశ్వరరావు ఇప్పటికీ పూర్వ పంథానే అనుసరిస్తూ పలు రకాల కూరగాయ పంటలను సాగు చేస్తున్నారు. కేవలం సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ పంటకు నీరు పెట్టేందుకు యాతాన్ని ఏర్పాటు చేశారు. అతి తక్కువ పెట్టుబడితో సేంద్రియ వ్యవసాయం చేస్తూ లాభాలను ఆర్జిస్తున్నాడు. పంట సాగులో ఎలాంటి యంత్రాలు, మోటర్లు గానీ రసాయన ఎరువులను వినియోగించడం లేదు.

సంతానం కలగలేదన్న మనస్తాపంతో..

- యువకుడు బలవన్మరణం
- దోకులపాడులో విషాదం


వడ్డి రాజు (ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని దోకులపాడు గ్రామానికి చెందిన వడ్డి రాజు(32) సంతానం కలగలేదన్న మనస్తాపంతో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. రాజుకు 12 ఏళ్ల క్రితం రాజ్యంతో వివాహం జరిగింది. పిల్లలు లేకపోవడంతో మానసికంగా కుంగిపోతూ మద్యానికి బానిసయ్యాడు. శనివారం ఎప్పటిలాగే కూలి పనులు చేసుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి భోజనం చేసి తన గదిలో పడుకునేందుకు వెళ్లాడు. కుటుంబ సభ్యులంతా నిద్రలో ఉండగా ఇంట్లో ఉన్న సూపర్ వాస్మిన్–33 నూనె తాగేశాడు. చావుబతుకులతో కొట్టుమిట్టాడుతున్న రాజును కుటుంబ సభ్యులు గమనించి వెంటనే పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి శవపంచనామా చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రాజ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నిహర్ తెలిపారు.

లారీ చోరీకి 'బ్రేక్'

- బ్రేక్ ఫెయిలైన వాహనం అని తెలియక దొంగతనానికి యత్నం
- మొరాయించడంతో రోడ్డుపైనే వదిలేసిన వైనం


రోడ్డుపైనే విడిచిపెట్టిన లారీ ఇదే

కంచిలి: లారీని చోరీ చేయాలనుకున్న ఇద్దరు దొంగల ప్రయత్నం బెడిసికొట్టింది. అప్పటికే మొరాయించిన వాహనం అని తెలియక దొంగతనం చేయాలని భావించి చివరకు స్థానికులకు దొరికిపోయారు. ఈ ఘటన కంచిలి మెయిన్ రోడ్డులోని జేఎంజే ఇంగ్లిష్ మీడియం స్కూల్ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇదే ప్రాంతంలో నివాసముంటున్న సాలిన నారాయణస్వామికి చెందిన లారీ ఇటీవల మరమ్మతులకు గురైంది. మెకానిక్‌కు చూపించేందుకు స్కూల్ సమీపంలోని చెరువు వద్ద పార్కింగ్ చేశారు. ఈ విషయం తెలియక ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు లారీని డ్రైవ్ చేసుకొని దొంగిలించే ప్రయత్నం చేశారు. అప్పటికే బ్రేక్ ఫెయిల్ కావడంతో బీపీ కాలనీ జంక్షన్ వరకు వచ్చేసరికి ఆగిపోయింది. చేసేదేం లేక లారీని రోడ్డుపైనే విడిచిపెట్టేశారు. అక్కడి నుంచి బలియాపుట్టుగ కాలనీలోకి వెళ్లారు. రత్నాల ధర్మారావు అనే వ్యక్తి ఇంట్లో కుమార్తె వివాహ ఏర్పాట్లలో అందరూ బిజీగా ఉండగా ఒకరు ఇంటి ప్రహరీ దూకి లోపలికి ప్రవేశించాడు. మిగిలిన వ్యక్తి కూడా లోపలికి వెళ్లబోతుండగా స్థానికులు గమనించి కేకలు వేశారు. దాంతో ఇద్దరిలో ఒకడు పరారవ్వగా.. మరొకడు దొరికిపోయాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, సిబ్బంది వచ్చి నిందితుడిని అదుపులోకి తీసుకొన్నారు. ఇతడ్ని పూర్తిస్థాయిలో విచారిస్తే ఇటీవల కాలంలో జరిగిన దొంగతనాలు వెల్లడయ్యే అవకాశం ఉంద స్థానికులు చెబుతున్నారు.

బీఈడీకి పూర్వ వైభవం!

- దాదాపు దశాబ్దం తర్వాత ఏడాది కాల వ్యవధికి మార్పు!
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏడాది వ్యవధితో కోర్సు
- ఎన్‌సీటీఈ కీలక నిర్ణయం
- రెండేళ్ల బీఈడీ కోర్సులకు ఆదరణ కరువు


తరగతి గదిలో బీఈడీ విద్యార్థినులు

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశంలో, రాష్ట్రంలో టీచర్ ఉద్యోగాలకు కేరాఫ్ అడ్రస్‌గా భావించే శ్రీకాకుళం విద్యార్థులకు తీపికబురు. దశాబ్దకాలం నుంచి రెండేళ్ల వ్యవధితో కొనసాగుతున్న బీఈడీ కోర్సు ఇకపై ఏడాది వ్యవధితో అందుబాటులోకి వచ్చే అవకాశముంది. పూర్వ మాదిరిగానే ఏడాది వ్యవధితో ఈ కోర్సును అందించేందుకు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ రంగం సిద్ధం చేసింది. అన్నీ అనుకూలిస్తే వచ్చే విద్యా సంవత్సరం(2025–26) నుంచే.. ఒకవేళ సాంకేతిక కారణాలతో జాప్యం జరిగితే 2026–27 నుంచి ఏడాది వ్యవధితో కూడిన బీఈడీ కోర్సును అందుబాటులో తీసుకువచ్చేందుకు కేంద్రప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. మరోపక్క ఏడాది కాలవ్యవధితో బీఈడీ కోర్సులు మొదలైతే సంతోషమేనని బీఈడీ కాలేజీ యాజమాన్యాల ప్రతినిధులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఒకప్పుడు ఎనలేని డిమాండ్..

రాష్ట్రంలో ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో ఒకప్పుడు బీఈడీ కోర్సులకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. సీట్లు దొరక్క తిప్పలు పడేవారు. ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసులు చేసినవారూ లేకపోలేదు. మేనేజ్‌మెంట్ కోటా కింద వేలాది రూపాయలు వెచ్చించి కోర్సులు పూర్తిచేశారు. అయితే 2015–16 నుంచి రెండేళ్ల కాలవ్యవధితో బీఈడీ కోర్సులను తీసుకురావడంతో క్రమేపీ ఆదరణ కరువైంది. దీనికి తోడు ప్రస్తుతం సెమిస్టర్స్ విధానం తీసుకురావడం, విపరీతమైన ఫీజులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ లేకపోవడం, టీచర్ ఉద్యోగాల భర్తీ చేయకపోవడం వంటి కారణాలతో బీఈడీ కనుమరుగైన పరిస్థితి దాపురించింది. ప్రస్తుతం డాక్టర్ బీఆర్‌ఏయూ అనుబంధంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 14 బీఈడీ కాలేజీలు ఉండగా అందులో 880 మంది వరకు చదువుతున్నారు.

ఎన్‌సీటీఈ కీలక నిర్ణయం..

దాదాపు దశాబ్ద కాలం తర్వాత ఏడాది బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలని నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల జరిగిన ఎన్‌సీటీఈ పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకుంది. అయితే నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) లేక రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) పూర్తి చేసిన విద్యార్థులకు మాత్రమే ఏడాది వ్యవధి బీఈడీ వర్తించనుంది. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

ఒక ఏడాది బీఈడీ ప్రోగ్రామ్..

జనవరి 11న ఎన్‌సీటీఈ టీచర్స్ ఎడ్యుకేషన్ రెగ్యులేటర్ గవర్నింగ్ బాడీ సమావేశంలో టీచర్ ట్రైనింగ్ కోర్సులకు సంబంధించిన పలు నిర్ణయాలను ఆమోదించింది. ఇందులో బీఈడీ కోర్సు ఏడాది కాల పరిమితికి సంబంధించి నిర్ణయం చేసింది. ఒక ఏడాది బీఈడీ ప్రోగ్రామ్ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.

బీఏ–బీఈడీ, బీకామ్–బీఈడీ, బీఎస్సీ–బీఈడీ కోర్సులను సైతం ఏడాది బీఈడీ ప్రోగ్రాంతో డిగ్రీ కోర్సులను డిజైన్ చేసేందుకు కూడా కసరత్తులు జరుగుతున్నాయి.


మంచి నిర్ణయం..



డిగ్రీ ఫైనలియర్ 5వ సెమిస్టర్ పూర్తయ్యింది. ఇంటర్న్‌షిప్ అవుతోంది. వచ్చే విద్యా సంవత్సరంలో బీఈడీలో చేరుతా. మా బ్యాచ్‌తో ఏడాది కాలవ్యవధితో బీఈడీ కోర్సు మొదలైతే చాలా సంతోషమే. రెండేళ్ల క్యాలవ్యవధి అంటే సమయం ఎక్కువ.

– టి.శృతి, డిగ్రీ విద్యార్థిని, శ్రీహరిపురం, ఆమదాలవలస

రెండేళ్లపై నిరాసక్తత..



ప్రస్తుత పోటీప్రపంచంలో ఎక్కువ కాలవ్యవధితో కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపించడంలేదు. ఈ నేపథ్యంలో ఏడాది కాలవ్యవధితో బీఈడీ కోర్సు తీసుకొస్తే మంచిదే. బీఈడీ కాలేజీలు సైతం పూర్వవైభవం సంతరించుకుంటాయి.

– డాక్టర్ కె.సూర్యచంద్రరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్) శ్రీకాకుళం